APTEL /26/A1193

నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి : 1 సంచిక : 193 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు పేజీలు : 8 గురువారం 3 సెప్టెంబర్ 2026 వెల : 05/-

## ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు..

# ఇది చంద్రబాబు విజన్

- పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు చేరిన గోదావరి జలాలు
- ఇది చంద్రబాబు ముందుచూపు వల్లే సాధ్యమైందని కొనియాడిన మంత్రి నిమ్మల
- గత ఐదేళ్లలో లెఫ్ట్ కెనాల్‌పై వైసీపీ ప్రభుత్వం తట్ట మట్టి కూడా వేయలేదని ఆరోపణ
- పోలవరం ఆలస్యం వల్ల ఈ ఏడాది 350 టీఎంసీల గోదావరి నీరు వృథా అయ్యిందని విమర్శ
- పట్టిసీమ, పురుషోత్తపట్నంలను విమర్శించిన జగన్ అవే పథకాలపై ఆధారపడాల్సి వచ్చిందని వ్యాఖ్య



పోలవరం, సెప్టెంబర్ 2 : ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ గోదావరి జలాలు ఈ ప్రాంతాన్ని తాకాయని, ఇది ముఖ్యమంత్రి, అపర భగీరథుడు చంద్రబాబు దార్శనికత వల్లే సాధ్యమైందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు చేరడం రాష్ట్ర జలవనరుల చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని ఆయన అభివర్ణించారు. బుధవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద సీఎం

మిగతా 2లో...

# ఉత్తరాంధ్రను ముద్దాడిన గోదారమ్మ

## పాయకరావుపేట వద్ద జలహారతి పట్టిన సీఎం చంద్రబాబు

- పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు చేరిన గోదావరి జలాలు
- పాయకరావుపేట వద్ద నీటికి సాష్టాంగ నమస్కారం చేసిన సీఎం చంద్రబాబు
- తొలి దశలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5 లక్షల మందికి తాగునీరు
- పలు నదులు, కొండలను దాటుతూ నిర్మించిన కాలువ ఒక ఇంజనీరింగ్ అద్భుతం





పోలవరం, సెప్టెంబర్ 2 : ఉత్తరాంధ్ర దశాబ్దాల కల సాకారమైంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకాయి. ఈ చారిత్రక ఘట్టానికి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వేదికైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి జలాలకు జలహారతి

2 లో..



## 'జీవితం పరుగుపందెం కాదు'..

### ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం కీలక సందేశం

సెప్టెంబర్ 2 : ఐఐటీ గువాహటికి చెందిన 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలని అస్సాం

(మిగతా 2వ పేజీలో)

## దుష్ట పరిపాలన అంతం కోసం పవన్ కృషి

# మరువలేనిది



ఎన్టీఆర్ జిల్లా, సెప్టెంబర్ 2: జిల్లాలోని తిరువూరు పట్టణంలో రాష్ట్ర ఉపముఖ్య మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరువూరు జనసేన పార్టీ కార్యాలయంలో జనసైనికుల ఆధ్వర్యంలో నిర్వహించిన పవన్ పుట్టినరోజు వేడుకల్లో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. భారీ కేక్‌ను కట్ చేసి ఉపముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దుష్ట పరిపాలన అంతం కోసం పవన్ కల్యాణ్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఎటువంటి

మిగతా 2లో...

## ఆ విమానాశ్రయాల పనులు

# వేగవంతం చేయండి



ఢిల్లీ, సెప్టెంబర్ 2 : కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో ఈరోజు (బుధవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని కోరారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను

2లో



## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం..

### ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం

# ఆపలేదు

- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సామాన్యుల కష్టాలు తీర్చేందుకు నిరంతరం కృషి చేశామన్న పొంగులేటి

మిగతా 2లో...

## నరసరావుపేట జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్

- పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్
- నరసరావుపేట జేఎన్టీయూకేలో నూతన హాస్టల్ భవనాల ప్రారంభం
- రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం
- గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో వసతి గృహాల నిర్మాణం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

సెప్టెంబర్ 2 : రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట మండలం కాకాని గ్రామ సమీపంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో (జేఎన్టీయూ



2లో

# రాష్ట్రంలో సాగునీటి పండుగ..

## చంద్రబాబు అపర భగీరథుడు

- రాష్ట్రంలో నిజమైన భగీరథ ప్రయత్నం జరుగుతోందన్న పట్టాభి
- గోదావరి-కృష్ణా అనుసంధానాలతో ఏపీ సస్యశ్యామలం కాబోతోందని వ్యాఖ్య
- వైసీపీ నేతలు క్రెడిట్ చోరీ డిజార్డర్ తో బాధపడుతున్నారని ఎద్దేవా

సెప్టెంబర్ 2 : ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానం, సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణతో నిజమైన భగీరథ ప్రయత్నం జరుగుతోందని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి కొనియాడారు. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రారంభించారని... పోలవరం కాలువను కూడా ప్రారంభించబోతున్నారని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాలతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందని, గోదావరి-కృష్ణా నదుల అనుసంధానంతో ఏపీ సస్యశ్యామలం



2లో

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం..

సెప్టెంబర్ 2 : తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్–1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు. కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

# నరసరావుపేట జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్

కాకినాడ పరిధి) నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహాలను నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత హాస్టల్ ప్రాంగణాన్ని, గదులను కలియతిరిగి విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు యూనివర్సిటీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# రాష్ట్రంలో సాగునీటి పండుగ.. చంద్రబాబు అపర భగీరథుడు

కాబోతోందని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్‌ల క్యాలెండర్‌ను విడుదల చేసిందని, అందులో కేటాయించిన 36 ప్రాజెక్టుల్లో ఏకంగా 14 ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంతానికే చెందడం సీమ పట్ల చంద్రబాబుకు ఉన్న అంకితభావానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష వైసీపీపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు కనీసం రూ.2,000 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కుప్పంకు నీళ్లిచ్చామని చెప్పి ట్యాంకర్లతో నీటిని తెచ్చి డ్రామాలు ఆడారని.. కానీ చంద్రబాబు మాత్రమే నిజంగా కుప్పంకు నీటిని తీసుకెళ్లారని గుర్తుచేశారు. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లకు గ్రీజ్ కూడా పూయలేని చేతకానితనంతో నాటి ప్రభుత్వం విపత్తును కొనితెచ్చిందని విమర్శించారు. టీబీ డ్యామ్ గేట్లను యుద్ధప్రాతిపదికన మార్చి నీటి నిల్వపై భరోసా కల్పించింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు.

వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణించిన పట్టాభి... వారు క్రెడిట్ చోరీ డిజార్డర్ తో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. రివర్స్ టెండరింగ్ పేరిట వేల కోట్లు దోచుకుని, పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి, పనులు 17 నెలలు నిలిచిపోవడానికి జగనే కారణమని ఆరోపించారు. జగన్ హయాంలో 'జలయజ్ఞం' కాస్త 'ధనయజ్ఞం'గా మారిందని... అనుమతులు లేని రాయలసీమ లిఫ్ట్ పేరుతో మట్టి పనుల కింద వైసీపీ నేత పెద్దిరెడ్డికి రూ.1,000 కోట్లు దోచిపెట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు కడుపుమంటతో అల్లాడిపోతున్నారని అన్నారు.

# 'జీవితం పరుగుపందెం కాదు'.. ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం కీలక సందేశం

ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను ఆయన ఆదేశించారు. సెప్టెంబరు 1న జరిగిన ఐఐటీ గువాహటి 33వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఐటీ గువాహటి కేవలం విద్యలో ప్రతిభ చూపించే సంస్థ కాదని.. అస్సాం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. ఐఐటీ గువాహటి విద్యార్థుల కోసం అస్సాం ప్రభుత్వం 100 స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని త్వరగా అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సంబంధిత అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను కోరారు. అస్సాం ఎదుర్కొనే సంక్లిష్టమైన సాంకేతిక, అభివృద్ధి సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో ఐఐటీ గువాహటి కీలక పాత్ర పోషిస్తుందని హిమంత బిశ్వ శర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.

# దుష్ట పరిపాలన అంతం కోసం పవన్ కృషి మరువలేనిది

లాభాలను ఆశించకుండా కూటమిగా ఉంటేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని అలోచించిన గొప్ప వ్యక్తి పవన్ కల్యాణ్ అని కొనియాడారు. యువత అంతా ఆయన్నే ఆదర్శంగా తీసుకుని నడవాలని సూచించారు. పవన్ చేసే ప్రతి పని రాష్ట్రం, ప్రజల ప్రయోజనం కోసమే అని స్పష్టం చేశారు. టీడీపీ కష్టకాలంలో కూడా అండగా నిలబడిన గొప్ప వ్యక్తి పవన్ అని అన్నారు. ఇలాంటి నాయకత్వం ఈ రాష్ట్రానికి చాలా అవసరమని చెప్పుకొచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మైత్రి చాలా గొప్పదని.. ఆ మైత్రితోనే కుటమి నాయకులంతా కలిసి కట్టుగా నడవాలని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు.

# గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు వేదికగా ఆత్మకూరు క్రీడా వికాస కేంద్రం



ఆత్మకూరు, సెప్టెంబర్ 2 : ఆత్మకూరు పట్టణంలో క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి, యువత, క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ఉదయం ఆత్మకూరులోని క్రీడా వికాస కేంద్రాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులు, రెవెన్యూ, క్రీడా శాఖాధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం క్రీడా ప్రాంగణ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత క్రీడా ప్రాంగణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించిన మంత్రి, క్రీడా ప్రాంగణ నిర్మాణానికి రూపొందించిన డిజైన్లను పరిశీలించి అధికారులతో చర్చించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని యువత, క్రీడాకారులకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశాలమైన క్రీడా మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు.

**20 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణం**

ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో ఆర్డీవో, తహసీల్దార్లతో చర్చించి ప్రతిపాదించిన స్థలంతో పాటు, పక్కనే ఉన్న మరో 9 ఎకరాల 80 సెంట్ల స్థలాన్ని కూడా కలిపి మొత్తం 20 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. నెల్లూరులోని ఏసీ స్టేడియం సుమారు 17 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికంటే పెద్దదిగా ఆత్మకూరు క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. నేషనల్ హైవే, అభయాంజనేయస్వామి ఆలయం, నాగులపాడు రోడ్డు తదితర ప్రాంతాలకు అనుసంధానంగా ప్రవేశ మార్గాలు, రహదారి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. రాబోయే 15 నుంచి 20 రోజుల్లో సమగ్ర ప్రణాళిక నివేదికను సిద్ధం చేసి అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. క్రీడా రంగంలో ప్రతిభ కలిగిన గ్రామీణ యువతను గుర్తించి, వారికి ఆధునిక శిక్షణ, మెరుగైన వసతులు అందించడం ద్వారా భవిష్యత్‌లో ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఆత్మకూరు ప్రాజెక్టు కింద క్రీడా వికాస కేంద్రం 2017 సెప్టెంబర్‌లో మంజూరు కాగా, 2018 ఆగస్టు 18న పనులు ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనుల్లో ఇప్పటికే సుమారు 50 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. గత ఎనిమిదేళ్లుగా కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల కాకపోయినా, సుమారు రూ.1 కోటి వరకు సొంత నిధులు వెచ్చించి పనులు చేపట్టినట్లు తెలిపారు. జూడా ఛైర్మన్ రవినాయుడు చొరవతో కాంట్రాక్టర్ మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అంగీకరించారని చెప్పారు. మిగిలిన పనులు, పెంపు పనులను పూర్తి చేసేందుకు అదనంగా రూ.1.78 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు జూడా అధికారులు అంగీకరించినట్లు మంత్రి తెలిపారు. ప్రణాళిక ప్రకారం మూడు నెలల్లో మిగిలిన పనులను పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

# ఆ విమానాశ్రయాల పనులు వేగవంతం చేయండి

రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రను ముద్దాడిన గోదారమ్మ.. పాయకరావుపేట వద్ద జలహారతి పట్టిన సీఎం చంద్రబాబు

ఇచ్చి, పవిత్ర జలాలను శిరస్సున చల్లుకున్నారు. అనంతరం నేలపై సాష్టాంగ ప్రమాణం ఆచరించి, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరిన క్షణాన తన కృతజ్ఞతను చాటుకున్నారు. ఓ దశలో కాలువ నుంచి నీరు ప్రవహిస్తుంటే, చంద్రబాబు మెడలోని పచ్చ కండువా తీసి గాల్లో గిరగిరా తిప్పి తన ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబును చూసి మిగతా నేతలు, రైతులు కూడా తమ కండువాలను గాల్లో ఊపుతూ హర్షం వెలిబుచ్చారు. అంతకుముందు, పాయకరావుపేట వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రెగ్యులేటర్ బటన్ నొక్కి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలోకి గోదావరి నీటిని విడుదల చేశారు. దాంతో కాలువలోకి ప్రవేశించిన గోదావరికి చంద్రబాబు జలహారతి పట్టారు. అనంతరం చంద్రబాబు, మరికొందరు రైతులు కూడా రెగ్యులేటర్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, నారాయణ, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ సీఎం రమేశ్ తదితరులు హాజరయ్యారు. చంద్రబాబు ఓపెన్ టాపు జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ పోలవరం ఎడమ కాలువ వద్దకు చేరుకున్నారు. సీఎంను స్వాగతిస్తూ వివిధ రీతుల్లో కళాకారులు స్వాగతం పలికారు. తప్పెటగుళ్లు, కోలాటం వంటి ప్రదర్శనలతో అలరించారు. పోలవరం జలాల ప్రయాణం ఒక అద్భుతమైన ఇంజనీరింగ్ విన్యాసం. తూర్పు కనుమలను తొలిచి, ఏలేరు, పంపా, తాండవ, వరాహ, శారద వంటి నదులను దాటుకుంటూ ఈ కాలువను నిర్మించారు. కొన్ని చోట్ల నదుల ప్రవాహానికి ఎగువన అక్విడెక్టులు నిర్మించగా, ఏలేరు నది గర్భం కింద నుంచి సైఫన్ ద్వారా నీటిని తరలించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. ఈ కాలువను ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానం చేయడం ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరాయి. ఈ ప్రాజెక్టుతో తొలి దశలో అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల్లోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందనుంది. భవిష్యత్తులో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.

# ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు.. ఇది చంద్రబాబు విజన్

చంద్రబాబు గోదావరి జలాలకు హారతి పట్టడం తెలిసిందే. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నిమ్మల రామానాయుడు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాకముందే, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఉత్తరాంధ్రకు నీరందించాలన్న చంద్రబాబు ముందుచూపు వల్లే ఈరోజు ఈ ప్రాంత ప్రజల దాహం తీరుతోందని మంత్రి అన్నారు. "2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, 2026 నాటికి లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి చేస్తామని మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం గడువులోగా పూర్తి చేసి ఈ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకొచ్చాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ రెండేళ్ల కాలంలోనే ఏలేరు, పంప, తాండవ, శారద, వరాహ వంటి ఐదు ప్రధాన నదులను, తొమ్మిది జాతీయ రహదారులను దాటుతూ కెనాల్ నిర్మాణంలో ఉన్న క్లిష్టమైన పనులను పూర్తి చేశామని తెలిపారు. కొమ్మరిలోవ వద్ద 100 మీటర్ల లోతైన కొండను తవ్వి కాలువను తీసుకురావడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నిమ్మల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంచి చేసే కూటమి ప్రభుత్వానికి, రాష్ట్రాన్ని ముంచేసిన "గొడ్డలి పార్టీ"కి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరుతూ మూడు కీలక విషయాలను ప్రస్తావించారు. "మొదటిది, గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌పై కనీసం ఒక్క తట్ట మట్టి పని చేయలేదు, అరబస్తా సిమెంట్ వాడలేదు, ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. అలాంటి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే హక్కు లేదు" అని ఆరోపించారు. "రెండోది, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ అసెంబ్లీలో పట్టిసీమను 'వట్టిసీమ' అని, పురుషోత్తపట్నం పనికిరాదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ఆ పంపులను పీకేస్తానని హెచ్చరించారు. కానీ ఈరోజు అవే పట్టిసీమ పంపులు కృష్ణా డెల్టా ఆయకట్టును ఆదుకుంటున్నాయి. సూపర్ ఎల్ నినో సంవత్సరంలో కూడా 32 టీఎంసీల నీటిని అందించాం. అదేవిధంగా, ఆయన పీకేస్తానన్న పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారానే నేడు ఉత్తరాంధ్రకు నీళ్లు వస్తున్నాయి. ఇది చంద్రబాబు ముందుచూపునకు, గొడ్డలి పార్టీ విధ్వంసకర పాలనకు మధ్య ఉన్న తేడా" అని మంత్రి విమర్శించారు. "మూడవది, 2019 నాటికి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశారు. ఆయన అధికారంలో కొనసాగి ఉంటే 2021కే ప్రాజెక్ట్ పూర్తయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, డయాఫ్రం వాల్ ధ్వంసం వంటి చర్యల వల్ల ప్రాజెక్టును నాశనం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే, ఈ సూపర్ ఎల్ నినో సంవత్సరంలో కూడా గోదావరి నుంచి సముద్రంలో వృథాగా కలిసిన 900 టీఎంసీల వరద నీటిలో కనీసం 300 నుంచి 350 టీఎంసీలను కృష్ణా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు తరలించేవాళ్లం" అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ అసమర్థత వల్ల తెలుగు జాతి భారీగా నష్టపోయిందని, ఈ ముంచేసే గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర ప్రజలు తరిమి తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# చిత్తడి నేలల, ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనలతో ఆక్వా, వ్యవసాయ రంగాలకు తీవ్ర నష్టం

**- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నష్టపోతున్న కొల్లేరు ప్రాంత రైతాంగం,ప్రజలు**
**- కొల్లేరు ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలి**
**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్**

ఉంగుటూరు (కైకరం), సెప్టెంబర్ 2, నేటి శుభోదయ : చిత్తడి నేలలు, ఎకో సెన్సిటివ్ జోన్ (పర్యావరణ సున్నిత ప్రాంతం) పేరుతో విధిస్తున్న నిబంధనలు ఆక్వా, వ్యవసాయ రంగాలకు, కొల్లేరు ప్రాంత రైతాంగానికి తీవ్ర నష్టమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఉంగుటూరు మండలం కైకరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో కట్టా భాస్కరరావు అధ్యక్షతన రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2002లో కొల్లేరు ప్రాంతంలోని 10వ కాంటూరు వరకు ఉన్న 2 లక్షల 25 వేల ఎకరాలను ఇరాన్ లోని రామ్‌సార్ లో జరిగిన అంతర్జాతీయ చిత్తడి నేలల సంరక్షణ సదస్సులో కొల్లేరును చిత్తడి నేలల జాబితాలో చేర్చినప్పటికీ, అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఎటువంటి అధికారిక నోటిఫికేషన్ లేదా మార్గదర్శకాలు విడుదల చేయలేదన్నారు. కొల్లేరు అభయారణ్యం 5వ కాంటూరు పైన ఉన్న 10వ కాంటూరు వరకు గల సుమారు లక్ష 50వేల ఎకరాలు పూర్తిగా రైతుల వరి పొలాలు, అక్వా చెరువులు, గ్రామాలు మరియు ఏలూరు పట్టణంతో సహా అభివృద్ధి చెందిన ప్రాంతాలు చిత్తడి నేలల పరిధిలోకి తీసుకు రావడం వలన ఈ నిబంధనలతో కొల్లేరు ప్రాంత రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, కైకలూరు తదితర నియోజకవర్గాల పరిధిలోని కొల్లేరు ప్రాంతం ప్రజలు, రైతులు ఆర్థికంగా దెబ్బతిని, ఉపాధి కోల్పోయి వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ఇప్పటికే కొల్లేరు ఆపరేషన్ వలన కొల్లేరు,ప్రజలు రైతాంగం నష్టపోయారని గుర్తు చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టుకు వాస్తవ విషయాలు చెప్పి ఎకో సెన్సిటివ్ జోన్, చిత్తడి నేలల పరిరక్షణ నిబంధనల నుండి రైతులను, ప్రజలను కాపాడాలని కోరారు. కొల్లేరు కాంటూరు 5 నుండి 3కు కుదించాలన్నారు. 5వ కాంటూరు వరకు 77 వేల ఎకరాలలో కొల్లేరు విస్తరించి ఉందని, కాంటూరు



5నుండి 3కు కుదింపు వలన కొల్లేరు అభివృద్ధి, కొల్లేరు ప్రజలకు మేలు జరుగు తుందన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రాంత ప్రజలకు రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**పెంచిన ఆక్వా మేత ధరలు వెంటనే తగ్గించాలి**

ఆక్వా ఫీడ్ తయారీ సంస్థలు ఏకపక్షంగా మేత ధరలు పెంచి వేయడం దారుణమని విమర్శించారు. మేత ధర కిలో కు రూ.9లు పెంచి వేసి ఇప్పటికే పెరిగిన మేత ధరలకు అదనంగా ఆక్వా రైతులపై మరింత పెట్టుబడి భారం వేయడం తగదన్నారు. ఒకవైపు చర్చలు జరుపుతూనే మరోవైపు ధరలు ఏ విధంగా పెంచి వేస్తారని ప్రశ్నించారు. పెంచిన ఆక్వా మేత ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతులు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

**10న కైకరంలో రైతు సంఘం జిల్లా సమావేశం**

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశాలు ఈనెల 10న కైకరంలోని వంతెన వద్ద ఉన్న కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి రైతు సంఘం ప్రతినిధులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశానికి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని చెప్పారు.రైతు సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# “ఘనంగా స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17 వర్ధంతి వేడుకలు”

పెంటపాడు సెప్టెంబర్ 2 (నేటి– శుభోదయ) పెంటపాడు కోనేరు చెరువు గట్టు వద్ద గల స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద 17వ వర్ధంతి వేడుకలు ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, బర్ల జయ రాంబాబు ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం వద్ద జోహార్ వైయస్ఆర్, జోహార్ వైయస్ఆర్ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి సభ్యులు రెడ్డి సూరిబాబు మాట్లాడుతూ మహానేత దివంగత స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు కొనియాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, 108, తదితర పథకాలను స్థిరస్థాయిగా గుర్తుండకపోయే పథకాలని మరియు జలయజ్ఞం, పోలవరం ప్రాజెక్ట్, పులిచింతల ప్రాజెక్టు, వెలుగొండ ప్రాజెక్ట్ శాశ్వతంగా స్థిరస్థాయిగా నిలిచిపోయే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన మహానుభావుడు రాజశేఖర్ రెడ్డి అని, నేటి ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపన చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన అన్నారు. ఆ మహానుభావుడు మరణం తట్టుకోలేక 650 మంది ప్రాణాలు విడిచారని గుర్తు చేశారు.మాజీ గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రాజెక్టులన్ని సస్యశ్యామలంగా చేశారని కూటమి ప్రభుత్వం చెప్పుకోడానికి ఏమీ లేక పాత పథకాలనే పేర్లు మార్చి కొనసాగిస్తున్నారని ఎద్దేవ చేశారు.ఈ కూటమి ప్రభుత్వాన్ని త్వరలో సాగనంపే రోజులు దగ్గరలో ఉన్నాయని ఆయన అన్నారు. పేద విద్యార్థి కార్పొరేట్ స్కూల్ లోకి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి ప్రతి విద్యార్థికి పిజిరేమ్బర్స్మెంట్ పథకాన్ని అమలు చేసి



ప్రయోజకుల్ని చేసే బాధ్యత వైయస్ రాజశేఖర్ రెడ్డి టైంలో జరిగిందని ఆయన అన్నారు. స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి రెండు అడుగుల ముందుకు వేస్తే ఆయన తనయుడు పది అడుగులు ముందుకు వేసి సంక్షేమ పథకాలు అన్నీ కూడా పేద ప్రజలకు అందించే బాధ్యత ఆయన ప్రభుత్వంలో అమలు చేశారని అన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షులు బర్ల జయరాంబాబు మాట్లాడుతూ ఎంతోమంది గుండె జబ్బులతో బాధపడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లలేక నానా అవస్థలు పడే పరిస్థితి చూసి ప్రతి ఒక్కరికి ఆరోగ్యశ్రీ అమలు చేసి స్థిరస్థాయిగా పేదల గుండెల్లో నిలిచిపోయే మహోన్నత వ్యక్తి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ కర్రీ వరహారెడ్డి, నల్లిమిల్లి అప్పి రెడ్డి ,మాజీ వార్డు మెంబర్లు మారంపూడి ఏసుదాసు, రెడ్డి శ్రీనివాస్, ఉండ్రాజవరపు రాజు, మరియు కర్రీ పృధ్వి కుమార్ రెడ్డి, చదలవాడ శ్రీనివాస్, మొఖమట్ల శ్రీనివాస్, తానేటి కుమార్ రాజా, బండారు రాంబాబు, రావిపాడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# “ వికసిత్ భారత్ లో పీఎంపీల సేవలు క్షేత్ర స్థాయి నుండి అందించాలి

**జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు”**



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 2 (నేటి– శుభోదయ) వికసిత్ భారత్ లక్ష్యసాధన లో పీఎంపీలు మాదకద్రవ్యాలు రహిత భారతదేశంగా క్షేత్ర స్థాయిలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని జాతీయ కార్యదర్శి విబిటి రాజు సూచించారు. కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం తాడేపల్లిగూడెం డాక్టర్ పీఎస్ మూర్తి మెమోరియల్ పీఎంపీ సేవా సదన్ నందు రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య పరిరక్షణ తోపాటు మాదకద్రవ్యాలు వాడడం వల్ల వచ్చే అనర్ధాలపై సామాజిక రుగ్మతలపై ఈగల్ పోలీసు టీమ్,రెడ్ క్రాస్ వంటి వారిని కలుపుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ముఖ్య అతిధిగా గుజరాత్ పీఎంపీ అధ్యక్షులు చప్పడి సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పీఎంపీలు అందిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యంతో పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా, మండల సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఎస్ వేణుగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్ళ రాంబాబు,రాష్ట్ర ముఖ్య సలహాదారులు నిడమర్తి జయసూర్య, గౌరవ సలహాదారులు కోన చిన్నారావు,రాష్ట్ర మీడియా కన్వీనర్,తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి పి దేవానందం, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఏఆర్కే పరమేశ్వర్లు, కోశాధికారి ఎమ్.జితేంద్ర, ఏలూరు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆనందం సుబ్బారావు,ఎమ్ జయరామ్,చిత్తూరు జిల్లా అధ్యక్షులు దామోదరరెడ్డి,కోశాధికారి ఆర్.భూపతి, నెల్లూరు జిల్లా కోశాధికారి శ్రీనివాస్,శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సిమ్మన్న,ఎన్ లక్ష్మీనారాయణ,మన్యం పార్వతీపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి సింహాచలం, తులసీదాస్,కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జేవీవీ సూర్యనారాయణ మూర్తి, ఎమ్డీ తానీషా,కోశాధికారి కె. శ్రీనివాసరావు, కోనసీమ జిల్లా కార్యదర్శి పున్నం రాము,కోశాధికారి ఎమ్ వీరబాబు,వైజాగ్ సురేష్ బాబు,కోన సత్యనారాయణ,రహమాన్ ఖాన్,నరసాపురం ప్రసాద్,బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో పండగ వాతావరణంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

**-సందడి చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నేతలు**
**-సినిమాల్లోనే కాదు రాజకీయాల్లోనూ పవన్ కళ్యాణ్ సెన్సేషన్.**
**-గుడివాడలో తాగునీటి కలుషిత సమస్య చెప్పగానే 3 రోజుల్లో పరిష్కరించారు...పవన్ స్పందన చూసి ఆశ్చర్యపోయా**
**-చంద్రబాబు అరెస్టు సమయంలో ఆయన తెగువే కూటమి విజయానికి కారణం**

గుడివాడ, సెప్టెంబర్ 2 నేటి శుభోదయ: జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు గుడివాడ పట్టణంలో పండగ వాతావరణంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి జనసేన శ్రేణులు, అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు.

**బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**

గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది జనసైనికులతో భారీ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఐఎంఏ హాల్ వరకు సాగిన ర్యాలీ జనసేన నినాదాలతో హోరెత్తింది. ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అభిమానులతో కలిసి భారీ కేక్‌ను కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

**టిడిపి నాయకులు వరుణ్...మహేష్ ఆధ్వర్యంలో**

టిడిపి నాయకులు పంచకర్ల మహేష్, సమ్మెట వరుణ్ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాము, బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులతో కలిసి కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఎమ్మెల్యే రాము “జై పవన్ కళ్యాణ్” అంటూ నినాదాలు చేయడంతో జనసైనికులు, అభిమానులు పెద్దఎత్తున స్పందించారు. జై పవన్ కళ్యాణ్ నినాదాలతో నెహ్రూ చౌక్ పరిసరాలు మారుమోగాయి.

**సందు పవన్ ఆధ్వర్యంలో వేడుకలు.**

గుడివాడ ఆఫీసర్స్ క్లబ్‌లో జనసేన నాయకుడు సందు పవన్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



పాల్గొని కేక్ కట్ చేసి జనసేన నాయకులు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

**వేమూరి త్రినాథ్ ఆధ్వర్యంలో.**

కుమ్మరి చెరువు వద్ద జనసేన నాయకుడు వేమూరి త్రినాథ్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుట్టినరోజు విందును ఎమ్మెల్యే ప్రారంభించారు.

**పెద ఎరుకపాడులో సందడి.**

పెద ఎరుకపాడులో జనసేన నాయకులు పుచ్చకాయల బుజ్జి ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలకు కేక్ తినిపించి పవన్ కళ్యాణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ “జై పవన్ కళ్యాణ్” నినాదాలతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తన చిన్నతనంలో ఎన్టీఆర్ ప్రభంజనాన్ని చూశానని, ఆ తర్వాత పవన్ కళ్యాణ్‌కు ఉన్న అభిమానుల ప్రభంజనాన్ని చూస్తున్నానని అన్నారు.

# మోటూరులో ఇంటి చోరీ కేసును చేదించిన రూరల్ పోలీస్ లు

**-రూ.4.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం, నిందితుడి అరెస్ట్**

గుడివాడ, సెప్టెంబర్ 2 నేటి శుభోదయ : ఇంటి బీరువా లాకర్‌ను పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. మోటూరు గ్రామానికి చెందిన తాడిపర్తి అశోక్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, రూ.4.20 లక్షల విలువైన 48.014 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు గుడివాడ రూరల్ సీఐ ఎస్.ఎల్.ఆర్. సోమేశ్వరరావు తెలిపారు. బుధవారం గుడివాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ కేసు వివరాలను వెల్లడించారు. మోటూరుకు చెందిన గండికోట శివపార్వతి ఇంటిలో బీరువా లాకర్‌ను పగులగొట్టి బంగారు ఆభరణాలు అపహరించిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. డీఎస్పీ పాలా శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మోటూరు, పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టగా లభించిన ఆధారాల ఆధారంగా అశోక్‌కుమార్‌ను నిందితుడిగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. నిందితుడి ఇంటి వద్ద నుంచి బంగారు చైన్, బ్రాస్లెట్‌తో పాటు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను




పోలీసులు రికవరీ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 48.014 గ్రాముల బంగారు ఆభరణాలు, వాటి విలువ సుమారు రూ.4.20 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబు, సీసీఎస్ ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు. వారి పనితీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రివార్డుకు సిఫారసు చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కృష్ణ జిల్లా నిమ్మకూరులో నందమూరి హరికృష్ణ 70వ జయంతి వేడుకలు

**-టీటీడీ కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాల నిర్వహణ**
**-ఎన్టీఆర్, హరికృష్ణ లకు నివాళులర్పించి పుష్పాంజలి ఘటించిన నేతలు**





నిమ్మకూరు, సెప్టెంబర్ 2 నేటి శుభోదయ : చైతన్యరథ సారథి, మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ 70వ జయంతి సందర్భంగా కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలోని టీటీడీ కళ్యాణ మండపంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. నందమూరి తారక రామారావు స్వగ్రామం నిమ్మకూరులోని నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం హరికృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తో పాటు కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, సూరపనేని హనుమంతరావు, డాక్టర్ సోమశేఖర్, చిన్నపాటి గాంధీ, గొట్టిపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ హరికృష్ణ ప్రజల మధ్య తిరిగిన నాయకుడని, ఆయన పర్యటనలకు అపూర్వ ప్రజాదరణ లభించేదని గుర్తు చేశారు. 1995లో విద్యార్థిగా ఉన్న సమయంలో హరికృష్ణ పర్యటనను ప్రత్యక్షంగా చూసిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, విజయవాడ నుంచి గుడివాడ మీదుగా సాగిన ఆ యాత్రకు ప్రజలు గంటల తరబడి స్వాగతం పలికిన దృశ్యాలు ఇప్పటికీ కళ్లముందు మెదులుతున్నాయని చెప్పారు. రవాణా శాఖ మంత్రిగా హరికృష్ణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ట్రాక్టర్ పన్ను రద్దు వంటి నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. గోదావరి వరదల సమయంలో జోలె పట్టి విరాళాలు సేకరిస్తూ బాధితుల కోసం కృషి చేసిన సేవాస్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. డ్రైవింగ్‌పై ఆయనకు ఉన్న మక్కువ, ప్రజలతో కలిసిమెలిసి ఉండే స్వభావం ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని అన్నారు. హరికృష్ణ సొంత గ్రామంలో ఆయన జయంతిని పురస్కరించుకుని రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

# గుడివాడలో ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి

**-మధ్యతరగతి ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన నాయకుడు వైఎస్ఆర్**
**-ఆయన అమలు చేసిన పథకాలే నేటికీ ప్రజల హృదయాల్లో ఆయనను చిరస్మరణీయంగా నిలిపాయి**
**-వైఎస్ఆర్ ఆశయాలకు అనుగుణంగా జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో కొడాలి నాని నాయకత్వంలో ముందుకు సాగుతాం**



గుడివాడ, సెప్టెంబర్ 2 నేటి శుభోదయ : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైయస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మహానేత సేవలను స్మరించుకుంటూ పేద మధ్యతరగతి ప్రజల అభ్యున్నతి కోసం వైయస్సార్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల హృదయాల్లో ఆయనను చిరస్మరణీయంగా నిలిపాయని కొనియాడారు. ముఖ్యంగా రైతన్నల సంక్షేమం కోసం ఆయన చేపట్టిన జలయజ్ఞం ప్రాజెక్టు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చి, రైతుల జీవితాల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాయని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సాగిన ఆయన రాజకీయ ప్రయాణం ద్వారా నిజమైన జన్మ సార్థకత వైయస్సార్‌కే చెల్లిందని వక్తలు అభిప్రాయపడ్డారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేలా, జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో కొడాలి నాని నాయకత్వంలో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగుతామని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవి. నారాయణరెడ్డి, పొట్లూరి కృష్ణారావు, లోయ రాజేష్,మొండ్రు వెంకటేశ్వరరావు,కొంకితల ఆంజనేయ ప్రసాద్,చుండూరి శేఖర్,గొళ్ళ రామకృష్ణ,గంటా శ్రీను,చింతల భాస్కరరావు, కొర్నిపాటి గణపతి,చింతా నాని,గుడే రవి,కలపాల కిరణ్,కాకొల్లు ప్రసాద్,వి.కృష్ణమోహన్,రమణ కుమార్,దుద్దు చిన్న,జోషి, నైనాల శేషు,క్రేను బాబి,జ్యోతుల మణికంఠ,ఎస్కే బాజీ, షేక్ సైదా, నౌషత్, జివిస్టి భాష, సర్దార్ బేగ్,ఖాదర్ బేగ్, షఫీ ఫాజిల్, అలీబేగ్, కరీముల్లా,అస్లాం, బాజీ,షమ్ము, కరిముల్ల,మామిళ్ళ ఎలీషా,రమేజా,కళావతి,సునీత,శేషం నిర్మల,సోనీ స్థానిక వైయస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి



చింతూరు, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ :దివంగత నేత మాజీముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని చింతూరులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకత్వంలో ఘనంగా నిర్వహించారు. వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని చింతూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున మోటారు సైకిళ్లతో చట్టి నుండి చింతూరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులందరూ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి మహనీయుడని ప్రతి వాడి గుండెల్లో ఇప్పటికీ రాజశేఖర్ రెడ్డి బతికే ఉన్నారని అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలే ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా చేశాయని, పేద ప్రజల కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. అలాగే మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి ఆశయాలు కొనసాగిస్తూ రానున్న రోజుల్లో జగనన్న ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలని, రాజశేఖర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ ఎడమర్తున్, మాజీ సర్పంచులు, మాజీ వార్డు మెంబర్లు, మండల ముఖ్యనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరంజీవి మహానేత వైఎస్ఆర్..!

**- 17వ వర్ధంతి సందర్భంగా మాచర్లలో ఘన నివాళులు**
**- వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి**





మాచర్ల టౌన్, సెప్టెంబర్ 2: ఆర్ సి ఇన్ఛార్జ్ హో ; నేటి శుభోదయ : ప్రజల సంక్షేమమే పరమావధిగా పాలన సాగించి, పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా మాచర్ల పట్టణంలో బుధవారం ఘన నివాళులు అర్పించారు.

పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ఆర్ విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సేవలను, ఆయన చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను స్మరించుకున్నారు. పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా వైఎస్ఆర్ పాలన సాగించిందని నాయకులు పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులు, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు, 108, 104 అత్యవసర సేవలు, పక్కా గృహాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక పథకాలతో కోట్లాది కుటుంబాలకు అండగా నిలిచారని కొనియాడారు.అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ సాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల రంగాలకు పెద్దపీట వేసిన మహానేత వైఎస్ఆర్ ప్రజా పాలనలో ప్రత్యేక ముద్ర వేశారని తెలిపారు. "ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, అందించిన సంక్షేమ ఫలాలు ప్రజల హృదయాల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటాయి" అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.మహానేత వైఎస్ఆర్ సేవలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని నాయకులు అన్నారు.

# నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలంటూ ఐ. టి.డి. ఎ ఎదుట ధర్నా



చింతూరు, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ : పోలవరం ముంపు నిర్వాసితుల కు తక్షణమే పరిహారం అందించాలని, పునరావాసానికి తరలించే సమయానికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, అన్ని కులాలవారికి ఒకే రకమైన ప్యాకేజీ ఇవ్వాలని అసైన్డ్ భూములకు కూడా పరిహారం ఇవ్వాలని కోరుతూ ధర్నా చేశారు .నిర్వాసితులు కోరిన చోటే పునరావాసం కల్పించాలని, కట్ ఆఫ్ డేట్ సెటిల్ మెంట్ రద్దు చేయాలని, కొత్తపల్లి దగ్గర వద్దని తమకు నచ్చలేదని కోరిన చోట పునరావాసం కాల్పించాలని కోరుతూ పి ఓ కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పోలవరం వి. ఆర్. పురం వడ్డీగూడెం గ్రామాల ముంపు నిర్వాసితులు పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**- భారీ కేకును కట్ చేసిన మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ బల్లాపల్లవి**



అనంతపురం బ్యూరో ఆగస్టు 02 నేటి శుభోదయ : జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా అనంతపురం నగర సమీపంలో ఉన్న ఎస్.కె. యూనివర్సిటీలో భగత్‌సింగ్ స్టూడెంట్ యూనియన్ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లాపల్లవి హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీ కేకును ఆమె కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లాపల్లవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త అనిల్ కుమార్ బిజెపి నాయకులు సూర్య ప్రకాష్ రెడ్డి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

# ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ను కలిసిన సిపిఓ బాలాజీ నాయక్



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 02 నేటి శుభోదయ : అనంతపురం నగరంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయం వద్ద పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ నూతన సి పి ఓ బాలాజీ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ నిధులు , ఇతర వర్క్ లో పురోగతి, త్వరితగతిన చేపట్టడానికి తగిన సూచనలను అధికారులకు తెలియజేశారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చినటువంటి పనులను త్వరగా నిర్వహించాలని , సరైన సమయంలో పనులు పూర్తి చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు. సంబంధిత వర్కు సంబంధించినటువంటి ఇంజనీర్లు కూడా ప్రజలను దృష్టిలో పెట్టుకొని పనులను పూర్తి స్థాయిలో క్వాలిటీ , పారదర్శకంగా నిర్వహించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ , సిబ్బంది పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలు

### అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు, జనసేన నాయకులు విన్నకోట సురేష్






బాపట్ల, సెప్టెంబర్ 02 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత జనసేనాని కొణిదెల పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలు బాపట్ల నియోజకవర్గంలో అత్యంత ఘనంగా, పండుగ వాతావరణంలో అంబరాన్నంటాయి. ప్రజా సంక్షేమమే పరమావధిగా రాజకీయాల్లో మార్పు కోసం అడుగులు వేస్తున్న తమ ప్రియతమ నాయకుడి పుట్టినరోజును జనసేన శ్రేణులు, అభిమానులు చిరస్మరణీయ రీతిలో జరుపుకున్నారు. బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ ప్రముఖ నాయకులు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో బాపట్ల పరిధిలోని మరుప్రోలువారిపాలెంలో నిర్వహించిన జన్మదిన వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, సమాజంలోని ఆర్తులకి మేలు చేసే సేవా కార్యక్రమాలతో ఈ వేడుకను నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై జనసేన శ్రేణులు భారీ కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలోని వృద్ధులకు చలి నుంచి రక్షణగా వెచ్చని దుప్పట్లను, మహిళలకు నూతన చీరలను విన్నకోట సురేష్ తమ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మీడియాతో మాట్లాడుతూ. రాష్ట్రంలో ప్రజా పాలనను అందిస్తూ, అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. పేదలు, వృద్ధులు, మహిళలకు ఆపద సమయంలో అండగా నిలబడటమే జనసేన పార్టీ అసలైన సిద్ధాంతమని, ప్రజాక్షేత్రంలో ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో మరియు కూటమి ప్రభుత్వం ఏర్పాటులో జనసేనాని పవన్ కళ్యాణ్ పాత్ర అసాధారణమైనది. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వ్యూహాత్మకంగా తెలుగుదేశం పార్టీ, జనసేన బీజేపీలను ఒకే వేదికపైకి తెచ్చి 'కూటమి' కట్టడంలో ఆయన చేసిన దూరచూపు రాజకీయ చరిత్రలో నిలిచిపోతుంది. స్వార్థ రాజకీయాలకు తావు లేకుండా, ప్రజల కష్టాలను కడతేర్చాలనే ఏకైక లక్ష్యంతో ఆయన ఎంచుకున్న రాజకీయ మార్గమే రాష్ట్రంలో అఖండ విజయాన్ని సాధించిపెట్టింది. ఎన్నికల్లో పోటీ చేసిన స్థానాల్లో వంద శాతం స్ట్రైక్ రేట్‌తో సరికొత్త చరిత్ర సృష్టించిన జనసేన పార్టీ, నేడు ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంటూ రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకగా నిలిచింది. ఉప ముఖ్యమంత్రిగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖల బాధ్యతలను నిర్వహిస్తూ పాలనలో పారదర్శకతకు, ప్రజాబాహ్య వనరుల సద్వినియోగానికి పవన్ కళ్యాణ్ పెద్దపీట వేస్తున్నారు. ఒక వైపు సినిమా రంగంలో అగ్రనాయకుడిగా వెలుగొందుతూనే, మరోవైపు ప్రజా సమస్యలపై నిలదీసే తత్వం, ఇచ్చిన మాట కోసం ప్రాణమిచ్చే తత్వం ఆయనను కోట్లాది మందికి ఆదర్శప్రాయుడిగా నిలబెట్టాయి. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

## న్యాయవాదుల రక్షణ చట్టం కోసం బాపట్లలో ధర్నా జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో ఆందోళన



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) సెప్టెంబర్ 2 :బాపట్ల: న్యాయవాదుల వృత్తి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల నుంచి రక్షణ కల్పించేందుకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ (న్యాయవాదుల రక్షణ చట్టం) ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమానికి బాపట్ల న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. ఈ మేరకు బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు న్యాయవాదులు విధులను బహిష్కరించి బాపట్ల కోర్టు సముదాయం ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్య ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ టి. రామకృష్ణ, ట్రెజరర్ నాగమోహిని, లైబ్రరీ సెక్రటరీ కారుమూరి సురేంద్రనాథ్, న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, శ్యామలాదేవి తదితరులు పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. న్యాయవాదుల వృత్తిపరమైన భద్రతకు ప్రత్యేక రక్షణ చట్టం అత్యవసరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## 4వ రోడ్డు శాంతినగర్ సర్కిల్‌లో వినాయక మండపానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్





అనంత పురం బ్యూరో సెప్టెంబరు 02 నేటి శుభోదయ : అనంతపురం నగరంలోని నాలుగవ రోడ్డు శాంతినగర్ సర్కిల్ వద్ద వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేయనున్న వినాయక మండపానికి అనంత పురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, వడ్డెర కుల సంఘాల నాయకులు, బోర్ వెల్ అషోసియేషన్ సభ్యులు, స్థానికులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా బోర్ వెల్ అసోసియేషన్ సభ్యులు, వడ్డెర సోదరులందరూ ఐకమత్యంతో వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తూ వస్తుండటం ఎంతో ఆనందదాయకమని అన్నారు. భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలు ప్రజల్లో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రతి సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్న వడ్డెర కుల సంఘాల నాయకులు, యువతను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బోర్ వెల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దలవాయి వెంకటనారాయణ, అధ్యక్షుడు కదిరప్ప, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రివర్యులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి





బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) సెప్టెంబర్ 2 :దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రివర్యులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా వైఎస్ఆర్సిపి రాష్ట్ర సెక్రెటరీ, బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ అబ్జర్వర్ చేజర్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి దివంగత నేతకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బేతనికాలనీలో పేషెంట్లకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి మరియు బాపట్ల జిల్లా బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ పరిశీలకులు చేజర్ల నారాయణ రెడ్డి మాట్లాడుతూ, వైయస్ఆర్ అందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. జలయజ్ఞం ద్వారా రాష్ట్రంలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.వైయస్ఆర్ ఆశయాలను ఆయన తనయుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తూచా తప్పకుండా కొనసాగిస్తూ, తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా వైయస్ఆర్ విగ్రహాలు రంగులు లేకుండా ఉండటాన్ని గమనించి, తన సొంత నిధులను వెచ్చించి బాపట్ల మండలంలోని పడమర బాపట్ల, కప్పలవారిపాలెం(బాపట్ల మండలం), దరివాదకొత్తపాలెం, బోలాయిపాలెం, పిట్టువారిపాలెం, కప్పల వారి పాలెం (పీవీ పాలెం మండలం), జి ఎన్ పాలెం, జమ్ములపాలెం తదితర ప్రాంతాల్లోని మొత్తం 10 విగ్రహాలకు రంగులు వేయించినట్లు తెలిపారు.వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు లోపు నియోజకవర్గంలోనీ రంగులు అవసరమైన విగ్రహాలకు కూడా రంగులు వేయిస్తామని వెల్లడించారు. అలాగే

బేతని కాలనీ ప్రెసిడెంట్ నటరాజన్ మాట్లాడుతూ, వైయస్ఆర్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని పేర్కొన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ప్రజల మనసుల్లో ఎప్పటికీ సజీవంగానే ఉంటారని తెలిపారు. అదేవిధంగా వైఎస్ఆర్సిపి వ్యవసాయ విభాగపు రాష్ట్ర కార్యదర్శి ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైయస్ఆర్ పాలనలో ఆరు సంవత్సరాల పాటు రైతులకు ఎలాంటి నీటి ఇబ్బందులు లేకుండా పంటలు పండాయని గుర్తుచేశారు. నేడు రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, నాటి వైయస్ఆర్ పాలనను, నేడు ఆయన ఆశయాలను కొనసాగాలంటే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కడికే సాధ్యం అని అన్నారు. తండ్రి ఆశయాలను నిలబెడుతూనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతులు కు చేసిన సేవను రైతులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బేతని కాలనీ ఏవో జావిద్ షరీఫ్ ఎస్.కె, ఆల్ ఇండియా ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్( జేఏసీ) అధ్యక్షుడు తూమాటి బాబురావు , బేతని కాలనీ ప్రెసిడెంట్ నట రాజన్ ,వైయస్సార్ సిపి నాయకులు కోకి అంకిరెడ్డి (ఎక్స్ ఆర్మీ), వైఎస్ఆర్సిపి వ్యవసాయ విభాగపు రాష్ట్ర కార్యదర్శి ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు బేతనీ కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు....

## శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రేపు కబేళాకు సెలవు వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 2 (నేటి శుభోదయ): శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో జంతువుల వధ, మాంసం విక్రయాలపై నిషేధం విధించినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రాత్రి నుండి కబేలాలో ఎటువంటి జంతువులను వధించుటకు అనుమతి లేదని నగరంలో ఉన్న అన్ని చికెన్ షాప్లు మటన్ షాప్లు చేపల మార్కెట్లు తెరుచుటకు అనుమతి లేదని తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించినా, లేదా షాపులను తెరిచి ఉంచినా, ఏ విధమైన మాంసాహారంలను విక్రయించినా, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.నగర ప్రజలు, మాంసం దుకాణాల నిర్వాహకులు, సంబంధిత వ్యాపారులు నగరపాలక సంస్థ ఆదేశాలను పాటించి సహకరించాలని కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.



## హోటళ్లు, రెస్టారెంట్లు, ఆర్వో ప్లాంట్లపై విస్తృత తనిఖీలు.పరిశుభ్రత, ఆహార నాణ్యత, తాగునీటి ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

విజయవాడ, సెప్టెంబర్ 2 (నేటి శుభోదయ): విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఆర్వో ప్లాంట్లలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, తాగునీటి ప్రమాణాలపై ప్రజారోగ్య అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఉదయం గుణదల, ఊర్మిళానగర్, లబ్బీపేట ప్రాంతాల్లోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఆర్వో ప్లాంట్లపై ప్రజారోగ్య అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వంటగదుల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, పరిసరాల శుభ్రత, సిబ్బంది పరిశుభ్రత వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే, వినియోగదారులకు సరఫరా చేసే తాగునీరు నాణ్యతపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. తాగునీటిని నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పరీక్షలకు పంపిస్తున్నారా, నీటి శుద్ధి ప్రక్రియను సక్రమంగా నిర్వహిస్తున్నారా, ఆర్వో ప్లాంట్లలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారులు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.

# వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తాం

**- నాటి జలయజ్ఞం ఫలితాలతోనే నేడు అన్ని ప్రాంతాలకు నీరు - ఉమ్మడి ఏపీలో 1.33 లక్షల కోట్లతో 86 సాగునీటి ప్రాజెక్టులు - ఐదేళ్ల వైఎస్ఆర్ పాలనలోనే 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు - నాడు జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అంటూ విమర్శించిన చంద్రబాబు- నేడు సాగునీటి ప్రాజెక్టుల ఘనత తనదేనంటూ బాబు క్రెడిట్ చోరీ - సంక్షేమ పథకాలతో పేదల పెన్నిధిగా వైఎస్ రాజశేఖరరెడ్డి - వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి - అనంతపురంలో మహానేత వైఎస్ఆర్‌కు ఘన నివాళి - సేవా కార్యక్రమాలు చేపట్టిన వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు**





అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 2 నేటి శుభోదయం : మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్ చేపట్టిన జలయజ్ఞం ఫలితాలతోనే నేడు అన్ని ప్రాంతాలకు గోదావరి, కృష్ణా జలాలు చేరుతున్నాయని కొనియాడారు. బుధవారం వైఎస్ఆర్ 17వ వర్ధంతి పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి అనంతపురంలోని వైసీపీ జిల్లా కార్యాలయం, జెడ్పీ ఆవరణలోని వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల పెన్నిధి అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 'మహాప్రస్థానం' పేరుతో సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్నారని గుర్తు చేశారు. 2004లో ముఖ్యమంత్రి కాగానే తొలి సంతకం ఉచిత విద్యుత్ ఫైల్‌పై పెట్టి రైతు పక్షపాతిగా నిలిచారని తెలిపారు. ఐదేళ్ల తన పాలనలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ప్రజల జీవితాలను మార్చారని తెలిపారు. రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించిన సంక్షేమ ప్రదాన వైఎస్ఆర్ అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి పథకాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.

### రూ.1.33 లక్షల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు

గోదావరి, కృష్ణా జలాలను ప్రతి ఎకరాకు అందించేలా రూ.1.33 లక్షల కోట్లతో జలయజ్ఞం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 86 సాగునీటి ప్రాజెక్టులను చేపట్టిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఐదేళ్ల వైఎస్ పాలనలో 16 ప్రాజెక్టులు పూర్తిగా..మరో 26 ప్రాజెక్టులను పాక్షికంగా పూర్తి చేశారని గుర్తు చేశారు. తద్వారా ఆ ఐదేళ్లలోనే 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడమే కాకుండా 4 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించినట్లు తెలిపారు. నాటి జలయజ్ఞం కారణంగానే నేడు అన్ని ప్రాంతాలకు గోదావరి, కృష్ణా జలాలు వస్తున్నాయన్నారు. "గతంలో వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ ఇస్తానంటే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందని చంద్రబాబు అన్నారు. జలయజ్ఞం అంటే ధనయజ్ఞం అని విమర్శించారు. అసలు వ్యవసాయమే దండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు. అలాంటి వ్యక్తి ఈ రోజు జలయజ్ఞం కారణంగా అందుతున్న ఫలితాలను మాత్రం తన ఖాతాలోకి వేసుకుంటున్నాడు" అని అనంత విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞంను ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని, వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల సేవా కార్యక్రమాలు

వైఎస్ఆర్ 17వ వర్ధంతి సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అనంతపురంలో సేవా కార్యక్రమాలు కొనసాగాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద అన్నదానం చేశారు. బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వజనాస్పత్రిలో వైద్య చికిత్సల కోసం పరికరాలు అందించారు. వైసీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రంగస్వామి నగర్‌లోని స్పందన అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తపోవనంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# జాయ్ అలుక్కాస్‌కు ఘన స్వాగతం

**- జాయ్ అలుక్కాస్ జ్యువెలరీ ఎండీ జాయ్ అలుక్కాస్‌కు స్వాగతం పలికిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**





అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 02 నేటి శుభోదయ :జాయ్ అలుక్కాస్ జ్యువెలరీ ఎండీ జాయ్ అలుక్కాస్ అనంతపురం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా ఘన స్వాగతం లభించింది.పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని హెలిప్యాడ్ వద్ద ప్రత్యేక హెలికాప్టర్‌లో దిగిన జాయ్ అలుక్కాస్‌తో పాటు జాయ్ అలుక్కాస్ ప్రతినిధులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జాయ్ అలుక్కాస్‌ను వారు ఆత్మీయంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం పరస్పరం వివిధ అంశాలపై ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నివాసానికి విచ్చేసిన జాయ్ అలుక్కాస్ జ్యువెలరీ ప్రతినిధులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి లు శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈకార్యక్రమంలో పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు, జాయ్ అలుక్కాస్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న ఎపిక్ సినిమా యూనిట్



విజయవాడ, సెప్టెంబర్ 2 (నేటి శుభోదయ): శ్రీ కనకదుర్గమ్మ వారిని బుధవారం ఎపిక్ సినిమా యూనిట్ చిత్ర బృందం ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్య శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

# యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించటమే పవన్ లక్ష్యం : ఎమ్మెల్యే బొలిశెట్టి "



తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 2: (నేటి –శుభోదయ) : యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించటమే జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యమని శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద చత్రపతి శివాజీ సెంటర్లో బుధవారం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి తాడేపల్లిగూడెం పట్టణం,వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అభిమానుల కోలాహలం మధ్య బర్త్ డే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ యువజన విభాగాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని అన్నారు. జనసేన పార్టీ కోసం 2019 నుంచి 2024 వరకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ పనిచేసిన యువకుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు.పార్టీ కోసం గత రెండున్నర సంవత్సరాలుగా కష్టపడుతున్న యువకులను గుర్తించి వివిధ విభాగాల్లో అవకాశాలు కల్పించామని అన్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా యువత, విద్యార్థులను రాజకీయాల్లోకి ఆహ్వానించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యార్హతలు, ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలపై అవగాహన లేని కొంతమంది రాజకీయ నాయకులుగా ఎన్నికవుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ వంటి పరీక్షల గురించి కూడా తేడా తెలియని వ్యక్తులను ఎన్నుకోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత వైసిపి పాలనలో ఎదుర్కొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఆలోచించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయకుండా పథకాలను పంచిపెట్టడానికే పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రజల సమస్యలపై స్పందించి, అవసరమైన సమయంలో బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కార్యకర్తలకు సూచించారు. పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను 24వ స్థానం నుంచి మొదటి స్థానానికి తీసుకువచ్చేందుకు కృషి జరిగిందన్నారు. సుమారు రూ.1,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు దాదాపు 7,000 నుంచి 8,000 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ కార్యక్రమాల్లో ప్రజలు, మీడియా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారథ్యంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తొలుత విశ్రాంత సైనిక ఉద్యోగులను సత్కరించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

# ఒంగోలు మొదటి మున్సిపల్ చైర్మన్ వరదా శ్రీరాములు నాయుడు జయంతి వేడుకలు



ఒంగోలు, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ (ప్రత్యేక ప్రతినిధి రాధా రమణ గుప్తా జంధ్యం) : ఒంగోలు పట్టణ 150 సంవత్సరాల వేడుకలు జరుగుచున్న సందర్భంగా ఒంగోలు మొట్టమొదటి మున్సిపల్ చైర్మన్ 'రావు బహుదూర్' వరదా శ్రీరాములు నాయుడు 161వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్ సమీపంలో నెలకొల్పిన ఆయన విగ్రహం వద్ద వివిధ రంగాల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీరాములు నాయుడు సేవలను కొనియాడారు. వరదా అమరేష్ నాయుడు (శ్రీరాములు నాయుడు మనుమడు): ఒంగోలు పట్టణానికి ప్రథమ మున్సిపల్ చైర్మన్‌గా తన ముత్తాత సమర్థవంతమైన పాలన అందించి మైలురాయిగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. తెనాలి శేషగిరి నాయుడు (ఆంధ్రప్రదేశ్ కాపు బలిజ ఫెడరేషన్ చైర్మన్): జీవితాంతం నిస్వార్థ సేవకే అంకితమైన వరదా శ్రీరాములు నాయుడు జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కుర్రా ప్రసాద్ బాబు (శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు): ఆనాటి బ్రిటిష్ వైస్రాయ్‌లకు, మన తెలుగు ప్రజలకు మధ్య వారధిగా నిలిచి, ఒంగోలును గ్రామ స్థాయి నుండి పట్టణంగా మార్చడంలో శ్రీరాములు నాయుడు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. స్వంత నిధులతో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టినందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు 'రావు బహుదూర్' బిరుదు ఇచ్చిందని, ఆయన చరిత్రను లండన్ లైబ్రరీలో నిక్షిప్తం చేయడం తెలుగువారందరికీ గర్వకారణమని తెలిపారు. ఈ జయంతి కార్యక్రమంలో ఒంగోలు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పప్పు సురేష్, 27వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు తూము రాజేష్, వెరిచర్ల అరుణ్ కుమార్ తదితర నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరం

## దుష్ట పరిపాలన అంతం కోసం పవన్ కళ్యాణ్ చేసిన పోరాటం మరువలేనిది ఎంపీ కేశినేని చిన్ని



విజయవాడ, సెప్టెంబర్ 2 (నేటి శుభోదయ):తిరువూరు జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు. తిరువూరు జనసేన పార్టీ ఇంచార్జి మనుబోలు శ్రీనివాసరావు, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా కూటమి తరపున ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. గతంలో రాష్ట్రంలో సాగిన దుష్ట పరిపాలనకు చరమగీతం పాడేందుకు పవన్ కళ్యాణ్ చేసిన పోరాటం, కూటమి ఏర్పాటులో ఆయన పోషించిన కీలక పాత్రను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువరని ఎంపీ చిన్ని అన్నారు.ఎలాంటి వ్యక్తిగత లేదా రాజకీయ లాభాలను ఆశించకుండా, రాష్ట్ర అభివృద్ధి కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా కలిసి పనిచేస్తేనే ఆంధ్రప్రదేశ్‌ను మరింత అభివృద్ధి చేయగలమని ఆలోచించిన గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. టీడీపీ కష్టకాలంలో ఉన్న సమయంలో కూడా అండగా నిలబడి పార్టీకి, నాయకత్వానికి బాసటగా నిలిచిన గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ అని కేశినేని చిన్ని పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలు, ప్రజా ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్న ఆయనలాంటి నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో అవసరమని అన్నారు.పవన్ కళ్యాణ్ చేసే ప్రతి పని రాష్ట్ర ప్రయోజనం, ప్రజల ప్రయోజనం కోసమేనని ఎంపీ తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం యువత పవన్ కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న మైత్రి, సమన్వయం ఎంతో గొప్పదని కేశినేని చిన్ని అన్నారు. ఈ మైత్రి రాష్ట్ర అభివృద్ధికి మరింత బలాన్ని ఇస్తుందని తెలిపారు.కూటమి నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా, సమన్వయంతో కలిసి పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీ చిన్ని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమానంతరం యువత అందరితో ఎంపీ చిన్ని ప్రత్యేకంగా కూర్చుని మాట్లాడారు జెన్ జీ ఆలోచనలతో దేశాన్ని మరింతగా ప్రభావితం చేయాలని కోరారు యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని తెలియజేశారు వారితో ఆప్యాయంగా మాట్లాడుతూ సెల్ఫీ వీడియోను ఆయన చరవాణితో చిత్రీకరించారు యువత కేరింతలతో సందడి చేశారుఈ కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మనుబోలు శ్రీనివాసరావు తిరువూరు మండల పార్టీ ప్రెసిడెంట్ పుల్లారావు, ఏ కొండూరు మండల పార్టీ ప్రెసిడెంట్ విజయ్ ఏఎంసి డైరెక్టర్ మాధవరావు పిఏసిఎస్ చైర్మన్ సీతారామస్వామి పిఏసిఎస్ డైరెక్టర్లు నవీన్ కొండబాబు, జనసేన పార్టీ పట్టణ ముఖ్య నాయకులు లింగనేని సుధాకర్ పసుపులేటి రవీంద్ర, రామిశెట్టి జగన్ నామా నాగరాజు పసుపులేటి పండు మరియు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కంట్రోల్ రూమ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



విజయవాడ, సెప్టెంబర్ 2 (నేటి శుభోదయ): దివంగత ముఖ్యమంత్రి, పేదల పెన్నిధి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ అధ్యక్షతన స్థానిక కంట్రోల్ రూమ్ వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు వైఎస్సార్ విగ్రహానికి పోలవరం ప్రాజెక్ట్ నీళ్లతో అభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి వెలంపల్లి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో నేడు అమలవుతున్న లేదా రూపుదిద్దుకున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులన్నీ వైఎస్సార్ దార్శనికత, సంకల్పంతోనే సాకారమయ్యాయి. పోలవరం, పులిచింతల, వెలుగొండ వంటి భారీ ప్రాజెక్టులకు ఆయన హయాంలోనే 'జలయజ్ఞం' కింద శ్రీకారం చుట్టారు. రైతులకు నిజమైన మేలు చేసిన ప్రభుత్వాలు డాక్టర్ వైఎస్సార్, ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిలే అని, ఆనాడు వైఎస్సార్ ఉచిత విద్యుత్ ఇస్తామంటే "కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాలి" అని హేళన చేసిన చంద్రబాబు, నేడు రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరం. చంద్రబాబు పాలన ఎప్పుడూ రైతులను మోసగించడానికే ప్రాధాన్యత ఇచ్చింది. పేదవాడి ఆరోగ్యం కోసం 'ఆరోగ్యశ్రీ', నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం 'ఫీజు రీయింబర్స్?మెంట్', వ్యవసాయానికి 'ఉచిత విద్యుత్' వంటి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి వైఎస్సార్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన భౌతికంగా దూరమై 17 ఏళ్లు గడిచినా నేటికీ ప్రజల గుండెల్లో బతికే ఉన్నారు. వైఎస్సార్ ఆశయాలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ముందుకు తీసుకెళ్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ రాయన భాగ్య లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా

## వకీల్ సాబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు





మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 2; నేటి శుభోదయ జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన నాయకుడు వకీల్ సాబ్ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నెహ్రూనగర్ ఫస్ట్‌లైన్‌లోని బీసీ సామాజికవర్గానికి చెందిన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వకీల్ సాబ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యకర్తలతో కలిసి సంబరాలు నిర్వహించారు. కేవలం జన్మదిన వేడుకలకే పరిమితం కాకుండా, ప్రజాసేవా కార్యక్రమాలు చేపట్టడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. రోగులకు బ్రెడ్, పండ్లను పంపిణీ చేయడంతో పాటు మహిళలకు చీరలను అందజేశారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వకీల్ సాబ్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. పేదలు, బలహీన వర్గాలు, మహిళలకు అండగా నిలవడం ప్రతి జనసేన కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రఘువర్మ, బత్తుల శివ, నాగేశ్వరరావు, చక్రధర్, బొజ్జం మల్లికార్జునరావు, పవన్, కొమ్ము రాజు తదితరులతో పాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

# కోరుకొండ శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు, శాస్త్రోక్తంగా 'సుదర్శన యాగం' విజయవంతం..!

**- 'శతమానం భవతి.. శతాయుః పురుషశ్శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి...' అంటూ వేద పండితుల దీవెనలు,..!**

**- ఎమ్మెల్యే 'బత్తుల' దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు.!**





కోరుకొండ, ఆగస్టు 2, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) : జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన మహోత్సవం రాజానగరం నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో..... రాష్ట్రంలో, దేశంలో అత్యున్నత స్థానంతో ప్రజలకు విశిష్టమైన సేవలు అందించి, వారికి మరింత చేరుకోవాలని స్వామి వారిని కోరుతూ పూజలు చేశారు. వజ్ర సంకల్పంతో తలపెట్టిన 'సుదర్శన యాగం'..... కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో...... స్థానిక శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, శ్రీమతి వెంకటలక్ష్మి చేతుల మీదుగా........ తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వేద పండితుల సాక్షిగా అత్యంత వైభవంగా పూర్తి చేశారు. ఈ యాగాన్ని తిలకించడానికి జనసేన పార్టీ శ్రేణులు, కూటమి నాయకులు పవన్ కళ్యాణ్ అభిమానులు కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి అత్యధిక సంఖ్యలో చేశారు. పూజలు, యాగాలు విజయవంతంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు చేతుల మీద భక్తులకు, జనసైనుకులకు, గ్రామస్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేసారు.

# శ్రీరంగపట్నం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభకు పట్టం..!

**- బిజెపి సీనియర్ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి చేతుల మీదుగా పీల హేమాశ్రీకి రూ.10,000 నగదు పారితోషికం..!**




కోరుకొండ, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం, కోరుకొండ మండలం శ్రీరంగపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాలలో ప్రథమ స్థానం సాధించిన పీల హేమాశ్రీ అనే విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం మరియు గ్రామ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో పూర్వ ఉపాధ్యాయురాలిగా పనిచేసి రిటైర్ అయిన సి. విజయలక్ష్మి విద్యార్థులలో ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ నగదు బహుమతిని ప్రకటించగా, నీరుకొండ చేతుల మీదుగా రూ. 10,000/- పారితోషికాన్ని హేమాశ్రీకి అందజేశారు. ఈ సందర్భంగా నీరుకొండ వీరన్న చౌదరి మాట్లాడుతూ --- విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. పదో తరగతిలో సాధించే ఉత్తమ ఫలితాలు భవిష్యత్తు బంగారు బాటకు పునాది అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ఈ ప్రోత్సాహక బహుమతిని అందజేసినట్లు తెలిపారు. పాఠశాలలోని ఇతర విద్యార్థులు కూడా హేమాశ్రీని ఆదర్శంగా తీసుకుని రాబోయే పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని హేమాశ్రీకి శుభాకాంక్షలు తెలిపారు.

# తండ్రికి తగ్గ తనయుడు నారా లోకేష్..!

- ప్రభుత్వ విద్య బలోపేతానికి వేగవంతమైన కృషి - ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి






మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 2 ; నేటి శుభోదయ : తండ్రి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదర్శాలను పునికిపుచ్చుకున్న నిలువెత్తు రూపమే విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కొనియాడారు. బుధవారం పల్నాడు జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటనను ఉద్దేశించి ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నరసరావుపేట మండలం కాకానీ వద్ద జేఎన్‌టీయూను మంజూరు చేసి, దాదాపు రూ.100 కోట్ల నిధులు కేటాయించారని గుర్తు చేశారు. అయితే, అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో కళాశాలలో మౌలిక వసతుల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని ఆయన విమర్శించారు. ఆనాడు చంద్రబాబు నాయుడు వేసిన విద్యా బీజం నేడు దినదినాభివృద్ధి చెందుతూ వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జేఎన్‌టీయూలో నెలకొన్న విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రూ.70 కోట్ల నిధులతో 360 గదులతో కూడిన వసతి గృహాన్ని నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య, పవిత్ర వేదమంత్రాల నడుమ నూతన వసతి గృహాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని జూలకంటి పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో తాను కూడా పాల్గొనడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా నారా లోకేష్ వేగవంతంగా చేస్తున్న కృషి అభినందనీయమని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన తీసుకుంటున్న చర్యలు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే జూలకంటి బ్ర?

# మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి: యాడికిలో వర్ధంతి వేడుకలు




యాడికి సెప్టెంబర్ 02 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : పేదల సంక్షేమం, ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పాలించి కోట్లాది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా ర్యాలీగా తరలివెళ్లి, మెయిన్ రోడ్ శాంతినగర్ కాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆయన అధికారంలో ఉన్న సమయంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, పావలా వడ్డీ, ప్రతీ పేదవానికి పక్కా గృహాల నిర్మాణం, 108, 104 అత్యవసర సేవల వంటి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి సంక్షేమ పాలనకు ఆద్యుడిగా నిలిచారని నాయకులు గుర్తుచేశారు. జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులను చేపట్టి రైతాంగానికి కొండంత అండగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ ఎం. సంజీవరాయుడు, స్టేట్ జాయింట్ సెక్రటరీ వెన్నపూస వెంకటరామిరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు భోగాతి బ్రహ్మానంద రెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పెద్దపేట లక్ష్మీదేవిలతో పాటు వైఎస్సార్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైఎస్సార్ అందించిన సేవలు, ఆయన ఆశయాలు ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు..

# వైయస్ రాజశేఖర్ రెడ్డి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది ఉచిత విద్యుత్, ప్రజలకు సాగు, త్రాగు నీరు అందించిన వైయస్సార్ వైసిపి ఇంచార్జ్

**వడ్డి రఘురామ్ నాయుడు"**

తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 2 (నేటి-శుభోదయ) రాష్ట్ర ప్రజలకు త్రాగు, సాగు నీరు అందించిన నేత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అని తాడేపల్లిగూడెం నియోజకవర్గం కోఆర్డినేటర్ వడ్డీ రఘురాం నాయుడు అన్నారు. బుధవారం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పోలీస్ ఐ ల్యాండ్ సెంటర్లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పడాల మార్కెట్ యార్డ్ లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి కృష్ణ, గోదావరి జలాలతో జలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వడ్డి రఘురాం నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. రైతన్నల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, సాగునీరు, ప్రజల కోసం త్రాగునీరు అందించిన ఘనత డా॥ వైయస్ రాజశేఖర్ రెడ్డి కి దక్కుతుందన్నారు.జలయజ్ఞం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా



చేపట్టారన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి రంగంలో మార్పుకు అడుగులు వేశారన్నారు. రైతులు -- పేదలు -- బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యంగా జలయజ్ఞం ద్వారా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల జలయజ్ఞం కాలంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బ్యారేజీలు, రిజర్వాయర్లు, కాలువలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, నీటిపారుదల ప్రాజెక్టులు చేపట్టబడ్డాయన్నారు. రైతులకు కరెంట్ బిల్లులు మాఫీ, ఉచిత విద్యుత్తు పథకాలతో వ్యవసాయాన్ని పండగ చేశారన్నారు.ఆరోగ్యశ్రీ పథకంతో పేద ప్రజలకు కార్పొరేట్‌వైద్యాన్ని చేరువ చేశారన్నారు.ఫీజు రియంబర్స్మెంట్తో పేద పిల్లలకు ఉన్నత చదువులు దగ్గర చేశారన్నారు.

# శానిటరీ కిట్ల'తో బీసీ హాస్టళ్లలో పరిశుభ్రత

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- రూ.6 కోట్లతో అన్ని హాస్టళ్లకూ శానిటరీ కిట్ల పంపిణీ
- ఒక్కో కిట్ లో 11 రకాల వస్తువులు
- పరిశుభ్ర వాతావరణంలో బీసీ బిడ్డల విద్య
- హాస్టళ్లలో పారిశుధ్యం మెరుగుకు 1,200 మందిని నియమించాం
- రాబోయే టెన్త్, ఇంటర్ కు ఇప్పటి నుంచే ప్రణాళికలు అమలు
- విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ : మంత్రి సవిత





అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 02 నేటి శుభోదయ : రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నిర్దేశించుకున్న 'విజన్--2047' లక్ష్యాలను చేరుకునే క్రమంలో భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన ఆరోగ్యం, పరిశుభ్రమైన వాతావరణం, మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. బీసీ హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నామని, ఇందుకోసం రూ.6 కోట్ల విలువైన శానిటరీ కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. బుధవారం విజయవాడ గుణదలలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సవిత శానిటేషన్ మెటీరియల్‌తో కూడిన శానిటరీ కిట్లను వర్కర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న బీసీ హాస్టళ్ల రూపురేఖలు మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. గతంలో బీసీ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు అధికారంలోకి వచ్చిన వెంటనే మరమ్మతులు చేపట్టి అవసరమైన మౌలిక వసతులను కల్పించామన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్లు, విద్యుత్ అంతరాయం లేకుండా ఇన్వర్టర్లు, కిటికీలకు నెట్లు, విద్యార్థుల సౌకర్యార్థం హ్యాంగింగ్ హుక్స్ వంటి వసతులను ఏర్పాటు చేశామన్నారు.

**బీసీ హాస్టళ్లకు రూ.6 కోట్లతో శానిటరీ కిట్లు**

హాస్టళ్లలో పారిశుధ్యానికి అత్యధిక ప్రాధాన్యం కల్పించామన్నారు. వసతి గృహాల్లో పారిశుధ్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సుమారు 1,100 కొత్త టాయిలెట్లను నిర్మించామని మంత్రి తెలిపారు. వాటి నిర్వహణ, పరిశుభ్రత కోసం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది శానిటేషన్ వర్కర్లను నియమించినట్లు చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యను బట్టి శానిటేషన్ సిబ్బందిని కేటాయించామని తెలిపారు. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నిరంతరం కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. టాయిలెట్లు, వాష్‌రూమ్‌లు, ఇతర ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సుమారు రూ.6 కోట్ల వ్యయంతో 11 రకాల వస్తువులతో కూడిన శానిటరీ కిట్లను ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సవిత తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వంటి ప్రత్యేక సేవలను కూడా అందిస్తున్నామని చెప్పారు. టాయిలెట్లు, కారిడార్లు, తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు సంబంధించి శానిటేషన్ సిబ్బందికి స్పష్టమైన ఎస్ఓపీ జారీ చేశామని, కిట్ల నిర్వహణపై వార్డెన్లకు కూడా నిబంధనలు రూపొందించామని వివరించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా హాస్టళ్లను 1-స్టార్ నుంచి 5-స్టార్ వరకు విభజించి, నెల, మూడు నెలలకు ఒకసారి, ఆరు నెలలకు ఒకసారి, వార్షికంగా అవసరమైన శానిటేషన్ సామగ్రిని అందించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**విద్యార్థులకు ప్రత్యేక తరగతులు**

హాస్టల్ విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనకు ఇప్పటినుంచే ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో ప్రత్యేక కోచింగ్ తరగతులు కూడా నిర్వహిస్తున్నామన్నారు. 'తల్లికి వందనం'తో పాటు ఇంటర్ విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' ద్వారా ప్రభుత్వం విద్యార్థులకు పూర్తి అండగా నిలుస్తోందన్నారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలన్న ముఖ్యమంత్రి ఆలోచన మేరకు డైట్ ఛార్జీలను 10 శాతం పెంచినట్లు మంత్రి తెలిపారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వసతి గృహాలకు అవసరమైన కొత్త వంట సామగ్రిని సమకూర్చడంతో పాటు, అవసరానికి అనుగుణంగా కుక్-కమ్-అటెండర్లు, కుక్స్, హెల్పర్లను కూడా నియమిస్తున్నామని తెలిపారు. హాస్టళ్లలో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు 'నెట్ జీరో హెల్తీ క్యాంపస్' కాన్సెప్ట్ ను అమలు చేస్తున్నామని తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ తెలిపారు. గత రెండేళ్లుగా ప్రతి 15 రోజులకు ఒకసారి హాస్టళ్ల పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తూ, అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని వివరించారు. హాస్టళ్ల పరిశుభ్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో శానిటేషన్ సిబ్బందిని నియమించడంతో పాటు, అవసరమైన శానిటేషన్ మెటీరియల్‌ను అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# ఈ నెల 3న యాడికిలో ఓటర్ల ప్రత్యేక గ్రామసభ




యాడికి సెప్టెంబర్ 02 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : యాడికి గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీ, ఎస్సీ మరియు ఎస్టీ వర్గాల ఓటర్ల తుది జాబితా పరిశీలన, ఆమోదం కోసం ఈ నెల 3వ తేదీన (03-09-2026) ప్రత్యేక గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి పి. గీత తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉదయం 10:30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుంది.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్న ఈ గ్రామసభకు సంబంధిత వర్గాల ఓటర్లు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు సకాలంలో హాజరుకావాలని కోరారు. ఓటర్ల జాబితాను పరిశీలించి, ఏవైనా సలహాలు, సూచనలు లేదా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా అందజేసి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆమె ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు...

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

# మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి కి ఘన నివాళులు..



అనంత పురం సెప్టెంబర్ 02 నేటి శుభోదయ : మరపురాని మహానేత అపర భగీరదుడు సంక్షేమ ప్రదాత.. అభివృద్ధి విధాత. డా"వై. యస్. రాజశేఖరరెడ్డి 17 వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన నియోజకవర్గ నాయకులు.. జనం గుండెల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి రూపం సజీవంగానే ఉంది. చిన్నారి గుండెకు చిల్లుపడితే లక్షలాది రూపాయలు వెచ్చించి నిండు నూరేళ్ల జీవితాన్ని ఇచ్చిన మహానేత.. పండుటాకులకు పెద్ద కొడుకై వారి సంరక్షణ బాధ్యత తీసుకున్న ప్రజల మనిషి.. ప్రపంచమంత ప్రేమను దక్కించుకున్ననేత మన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి . మా సంతోషంలో ఎప్పటికీ జీవించే ఉంటావు రాజన్న..ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు,రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల,గ్రామ అనుబంధ విభాగాలు అధ్యక్షులు సభ్యులు వై.యస్.ఆర్.సీపీ ముఖ్యనాయకులు,కార్యకర్తలు, అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మరుపురాని మహానేతకు ఘన నివాళులర్పించిన మాజీ మంత్రి

## వెలంపల్లి పశ్చిమలో పలు డివిజన్ లలో సేవా కార్యక్రమాలు



విజయవాడ, సెప్టెంబర్ 2 (నేటి శుభోదయం): దివంగత ముఖ్యమంత్రి డా వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పలు డివిజన్ లలో రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా పాల్గొని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు,చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించి అనంతరం అన్నదానం, వస్త్రదానం, పండ్లు పంపిణి ,పుస్తకాల పంపిణీ, తదితర సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం మాజీ మంత్రి వెలంపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు చోట్ల వై ఎస్ ఆర్ 17వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు.వైఎస్సార్ సంక్షేమ పాలన పునరావృతం కావాలంటే వైఎస్ జగన్‌తోనే సాధ్యం అని అన్నారు.వైఎస్ రాజశేఖరరెడ్డి ఐదేళ్ల పాలనలోనే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే పథకాలను అందించారని కొనియాడారు. 'సంక్షేమం అంటే వైఎస్సార్ వైఎస్సార్ అంటే సంక్షేమం' అనే స్థాయిలో పాలన సాగిందన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో జలయజ్ఞం కింద పోలవరం,పులిచింతల,వెలుగోడు,హంద్రీ-నీవా వంటి భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి రైతాంగాన్ని ఆదుకున్న మహనీయుడు ఆయనేనని గుర్తుచేశారు.ఆనాడు వైఎస్సార్ ప్రారంభించిన జలయజ్ఞాన్ని 'ధనయజ్ఞం' అని చంద్రబాబు ఎగతాళి చేశారని,ఉచిత కరెంట్‌పై హేళనగా మాట్లాడారని మండిపడ్డారు. వైఎస్సార్ బాటలోనే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పారదర్శకంగా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చారని తెలిపారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సంక్షేమం అట్టడుగుకు పడిపోయిందని,అభివృద్ధి కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదని ఆరోపించారు.రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ నాటి సంక్షేమం,అభివృద్ధి జరగాలన్నా,సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. బ్రాహ్మణ వీధిలో గల జమ్మిదొడ్డి దగ్గర ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైసిపి నాయకులు విశ్వనాధ రవి ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వైయస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి పండ్లు పంపిణి చేసారు.46వ డివిజన్ లంబాడి పేట లో గల మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నరేంద్ర కార్యాలయంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వైయస్ ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి పండ్లు పంపిణి చేసారు. 34వ డివిజన్ అధ్యక్షులు బండి రాజ్ కుమార్, రాష్ట్ర అధికారప్రతినిధి బండి పుణ్యశీల ఆధ్వర్యంలో ఎర్రకట్ట డౌన్ లో గల పార్క్ లో ఉన్న వై ఎస్ ఆర్ విగ్రహం వద్ద జరిగిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వైయస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి అన్నదానం చేసారు. కృష్ణ హోటల్ సెంటర్ లో మాజీ డిప్యూటీ మేయర్ అవుతూ శైలజ, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వైయస్ ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ లు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వే పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలి

## - జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్





అనంతపురం, బ్యూరో సెప్టెంబర్ 02 నేటి శుభోదయ :రీసర్వే పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం బెలుగుప్ప మండల కేంద్రంలో రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి 6వ విడత పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని, రీసర్వే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బెలుగుప్ప తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మ్యుటేషన్లు, పిజిఆర్ఎస్ దరఖాస్తులు దస్త్రాల పరిష్కారాన్ని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, తహసీల్దార్ అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ గురు బ్రహ్మ, విఆర్ఓలు విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

# కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుండి గాదరాడ ఓం శివశక్తి పీఠం - 'శంబాల నగరం' వరకు కనులపండువగా సాగిన జనసేన భారీ బైక్ ర్యాలీ..!

## - ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో వేలాదిగా తరలివచ్చిన జనసేన నాయకులు, జనసైనికులు,యువత..!





కోరుకొండ, సెప్టెంబర్ 2, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రాజానగరం నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. కోరుకొండలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య క్షేత్రం నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ, గాదరాడ ఓం శివశక్తి పీఠం శంబాల నగరం వరకు అత్యంత వైభవంగా, జనసందోహం నడుమ కొనసాగింది. ముందుగా కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీని ప్రారంభించారు. వందలాది బైక్‌లతో, పవన్ కళ్యాణ్ చిత్రపటాలు, జనసేన జండాలు చేతబూని జై జనసేన జై పవన్ కళ్యాణ్ నినాదాలతో దారి పొడవునా రహదారులన్నీ మార్మోగిపోయాయి. ప్రతి అడుగునా అభిమానులు, కూటమి శ్రేణులు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. మార్గ మధ్యలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు అడపా శ్రీనివాస్ ఏర్పాటు చేసిన 50 కేజీల భారీ కేక్ కటింగ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే 'బత్తుల' కేక్ కట్ చేసి, నాయకులకు తినిపించి, పవన్ కళ్యాణ్కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ... 'రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా రాత్రింబవళ్లు శ్రమిస్తున్న నాయకుడు మన పవన్ కళ్యాణ్ ఆయన ఆశయాలకు అనుగుణంగా రాజానగరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు మేమంతా కట్టుబడి ఉన్నాం. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలకు వేలాదిగా తరలివచ్చిన యువత, అభిమానులు, జనసైనికుల నిబద్ధత చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. మన జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేయాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.' అని పేర్కొన్నారు. అనంతరం ఓం శివశక్తిపీఠం - శంబాల నగరం కళ్యాణ మండపం నందు జనసేన పార్టీ యువజన విభాగం లోగో 'జై కొట్టు' ను ఆవిష్కరించారు..అనంతరం ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ముఖ్య నాయకులు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి,, జనసేన పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మేడిశెట్టి శివరాం, సీనియర్ నాయకులు డాక్టర్ అడపా శ్రీనివాస్, కోరుకొండ మండల పార్టీ అధ్యక్షులు అడ్డాల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ ఎర్రంశెట్టి పోలారావు, దేశాల శ్రీను, తాటికొండ బుజ్జి, జనసైనికులు, వేలాది మంది అభిమానులు మరియు యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇడుపులపాయ లో వైయస్ రాజశేఖర్ రెడ్డి కి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



అనంత పురం సెప్టెంబర్ 02 నేటి శుభోదయ :నేడు మన దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైయస్ఆర్ ఘాట్ వద్ద వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వైయస్ విజయమ్మ తో పాటు కలిసి నివాళు లర్పించిన, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి , వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ స్టడీ సర్కిల్ నిర్మాణానికి భూమి పూజ చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 02 నేటి శుభోదయ : అనంతపురం నగరంలోని మహిళా , బాలల గ్రంథాలయ ప్రాంగణంలో ఉన్న ఆడిటోరియంను నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా 'ఎన్టీఆర్ స్టడీ సెంటర్ గా మార్చేందుకు అనంతపురం జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ గా నిర్ణయించడం జరిగింది. అందులో భాగంగా ఇటీవల జిల్లా గ్రంధాలయ సంస్థ నిధులను 5 లక్షల రూపాయలు జిల్లా కలెక్టర్ ద్వారా 35 లక్షల రూపాయాలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిర్మాణ పనులకు సంబంధించి బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ (ఉమ్మడి అనంతపురం జిల్లా) చైర్మన్ వడ్డే వెంకట్ ఘనంగా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ వడ్డే వెంకట్ మాట్లాడుతూ... పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు ఈ ఎన్టీఆర్ స్టడీ సెంటర్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం , స్టడీ సెంటర్ అవసరాల నిమిత్తం తాగునీటి ఎద్దడి కలగకుండా వెంటనే బోరు వేయించాలని అధికారులను ఆదేశించారు. నేడు బోరు వేయుటకు పూజ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సెక్రటరీ శివప్రసాద్, డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, సీనియర్ అసిస్టెంట్ రాజు, కే. మహేష్, లైబ్రేరియన్లు గోవింద్, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణతో 62వ డివిజన్‌లో 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం,ఎన్టీఆర్ స్ఫూర్తితో.. పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబాటు బొండా ఉమా

విజయవాడ, సెప్టెంబర్ 2 (నేటి శుభోదయ): 62వ డివిజన్ ప్రకాష్ నగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి, అక్కడి నుంచి "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని అన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి పేదలు, రైతులు, మహిళలు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు."ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉమా తెలిపారు. ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం తెలుగుదేశం పార్టీకి ఎప్పటి నుంచో ఉన్న సంప్రదాయమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, రైతులు, మహిళలు, యువతకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ ఇంచార్జ్ పైడి శ్రీను, సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పైడి తులసి, బెజ్జం జైపాల్, డివిజన్ అధ్యక్షులు జలకం రాజా, మరియ బాబు, డివిజన్ మహిళ రవణమ్మ, సీనియర్ నాయకురాలు బోను వెంకాయమ్మ, ఆరుమల్ల గోపిరెడ్డి, ఉదయ్ శంకర్, గడ్డం రాజేశ్వరరావు, ఎన్డీఏ కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ డివిజన్ నాయకులు, అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మరువలేని మహానేత... చెరగని జ్ఞాపకం...సంక్షేమానికి చిరునామా

**– పేదల పాలిట దేవుడు...మన రాజన్న వైఎస్సార్! ??**

చిన్నపాండూరులో మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా యువ నాయకుల ఘన నివాళులు... అన్నదానం, రోగులకు పండ్లు--బ్రెడ్ పంపిణీ

వరదయ్యపాలెం, చిన్నపాండూరు: పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మహానేత, దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వరదయ్యపాలెం మండలం చిన్నపాండూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుల ఆధ్వర్యంలో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, ఆయన ప్రజాసేవలను, సంక్షేమ పాలనను, పేదల పట్ల చూపిన మానవత్వాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్న మాట్లాడుతూ, "కాలం మారినా... పాలకులు మారినా... పేదల గుండెల్లో వైఎస్సార్ వేసిన చెరగని ముద్ర ఎప్పటికీ చెరిగిపోదు. ప్రజల కన్నీటిని తుడిచిన రాజన్న జ్ఞాపకాలు ప్రతి వర్ధంతి రోజున మాత్రమే కాదు, ప్రతి పేదవాడి జీవితంలో ప్రతిరోజూ కనిపిస్తూనే ఉంటాయి" అని అన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే చిన్నపాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారికి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. మహానేతను కేవలం మాటలతో స్మరించుకోవడం కాకుండా, ఆయన చూపిన సేవా మార్గాన్ని ఆచరణలో కొనసాగించడమే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ , వైఎస్సార్ పేరు వినగానే పేద ప్రజలకు గుర్తొచ్చేది సంక్షేమం, ఆప్యాయత, భరోసా అని అన్నారు. పేదవాడి కష్టాన్ని తన కష్టంగా భావించి పనిచేసిన నాయకుడిగా వైఎస్సార్ కోట్లాది ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. మాజీ సింగిల్ విండో చైర్మన్ హరిబాబు రెడ్డి మాట్లాడుతూ, పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం కోసం మహానేత వైఎస్సార్ తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోయాయని అన్నారు. ప్రజల కష్టాలను దగ్గరగా తెలుసుకుని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన గొప్ప ప్రజానాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. యువ నాయకుడు మహేంద్ర మాట్లాడుతూ, మహానేత భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ ఆలోచనలు, రైతుల పక్షపాత విధానాలు, పేదల పట్ల చూపిన మానవత్వం ఎప్పటికీ సజీవంగానే ఉంటాయని అన్నారు. "వైఎస్సార్ పేరు కేవలం ఒక నాయకుడి పేరు కాదు... కోట్లాది మంది ప్రజల గుండెల్లో చెరగని చరిత్ర" అని పేర్కొన్నారు.

# బీసీలకు అండగా తెలుగుదేశం పార్టీ

**– బీసీలకు చట్టసభల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించి చరిత్ర సృష్టించాం ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, సెప్టెంబర్ 2 (నేటి శుభోదయ): తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని, టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు పార్టీకి వెన్నుముకగా నిలిచారని, అదేవిధంగా బీసీలకు కూడా పార్టీ అండగా ఉందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. బుధవారం ఉదయం తూర్పు లోని 6వ డివిజన్‌లో ఎమ్మెల్యే గద్దె పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన అక్కడి వారిని అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం డివిజన్‌లో టీడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె పాల్గొన్నారు. ఈ డివిజన్‌లో డోర్-టు-డోర్ కార్యక్రమాన్ని వంద శాతం నిర్వహించిన బూత్ కన్వీనర్లను, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన కూటమి ప్రభుత్వం రాబోయే రోజుల్లో చరిత్ర సృష్టించబోతోందన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచే బీసీలకు ప్రాధాన్యత ఇస్తోందని, తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఏ కార్యక్రమం చేసినా అది బీసీలకు ఉపయోగపడేలా రూపొందించిందని చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత అన్న నందమూరి తారక రామారావుదేనని అన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆ 20 శాతాన్ని 34 శాతానికి పెంచారని చెప్పారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా రిజర్వేషన్లు అమలు చేయడానికి అవసరమైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో ప్రత్యేక కమీషన్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిషన్ విస్తృతంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తోందన్నారు. ఈ విధంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల చట్ట సభల్లో బీసీలకు బలమైన ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదు సంవత్సరాల పాలన బీసీలకు చీకటి రోజులని ఎమ్మెల్యే గద్దె అన్నారు. బీసీ నాయకులను అణగదొక్కడమే కాకుండా బీసీలకు సంబంధించిన అనేక ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేశారని అన్నారు. ఆదరణ, సబ్సిడీతో రుణ సౌకర్యాలు, బీసీ బస్‌ప్లాన్‌లను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. అటువంటి పార్టీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడటం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్ళ కాలంలోనే బీసీ సంక్షేమానికి ఎన్నో చర్యలు చేపట్టిందని చెప్పారు. తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నుముకగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పడాల గంగాధర్, జనసేన నాయకుడు పల్లి దుర్గాప్రసాద్, మకర గురునాధం, ఉనుము దుర్గారావు, ఉద్ది సుబ్బారావు, పడాల నాగు, పడాల వాసు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

**– మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు**




నేటి శుభోదయ, రాజేంద్రనగర్: గంపలగూడెం మండలంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తోటమూల మండల జనసేన పార్టీ కార్యాలయం వద్ద, తోటమూల రింగ్ సెంటర్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం వరకు ర్యాలీగా వెళ్లారు. రక్తదాన శిబిరాన్ని గంపలగూడెం మండల పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్. ఐ. జి. అనిల్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్. ఐ. మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఇంత పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మండల జనసేన పార్టీ అధ్యక్షులు చింతలపాటి వెంకట కృష్ణారావు జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున జనసైనికులు హాజరయ్యారు. సుమారు 25 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మనుబోలు శ్రీనివాసరావు, ఏ. ఎం. సి. డైరెక్టర్ పసుపులేటి మాధవరావు, గాజువాకగూడెం సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన అగ్రి ఎక్స్‌పో & కిసాన్ మేళా

**– రైతుల కోసం సుమారు 40 స్టాల్స్ ఏర్పాటు!**

**– కిసాన్ మేళాలో పాల్గొన్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



నేటి శుభోదయ నాయుడుపేట :తిరుపతి జిల్లా నాయుడుపేటలో అగ్రి ఎక్స్‌పో ం కిసాన్ మేళా కార్యక్రమం జరిగింది. రైతుల కోసం సుమారు 40 స్టాల్స్ ఏర్పాటు చేశారు. కిసాన్ మేళాలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ, తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. సాంకేతికతతో వ్యవసాయాన్ని పండుగ చేయడమే చంద్రబాబు లక్ష్యం అని ఎమ్మెల్యే విజయశ్రీ తెలిపారు. నాయుడుపేట పట్టణంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'అగ్రి ఎక్స్‌పో మరియు కిసాన్ మేళా – 2026' కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల అవగాహన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సుమారు 40 కి పైగా వ్యవసాయ స్టాల్స్‌ను ఎమ్మెల్యే డా. విజయశ్రీ, జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఈ ప్రదర్శనలో ఉంచిన ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, డ్రోన్ల వినియోగం, నూతన యంత్రాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మరియు విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ టెక్నాలజీ ప్రదర్శన రైతులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో, వ్యవసాయాన్ని దండగ కాదు పండుగ అని నిరూపించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం అరకొరగా రూ.13,500 ఇస్తే, మన ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది కూడా 'అన్నదాత సుఖీభవ' కింద రూ. 20,000 అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. రాత్రి వేళల్లో రైతుల కష్టాలు తీర్చేందుకు పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు, సాగునీటి కోసం కొత్తగా లక్షకు పైగా ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం," అని వివరించారు. అలాగే, రైతులపై పెట్టుబడి భారం పడకుండా ఆధునిక డ్రోన్లపై 80-90 శాతం భారీ సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తోందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. రైతులు ఈ నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి ఆర్థికంగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతు సోదరులు పాల్గొన్నారు.